తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
08 అక్టోబర్ 2026
సంపుటి 03
సంచిక 359
పేజీలు 8
వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## ఈసి నియామకాల తీర్పు రికాల్‌పై పిటిషన్

- **పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 సీఈసీ, ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధిం చిన 2023 చట్టంపై దాఖలైన పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టులో కీలక పరిణామం జరిగింది. ఈ అంశంపై సెప్టెంబర్ 23న వెలువడిన భిన్నమైన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది.ప్రధాని, లోక్‌సభ విపక్ష నేత, సీజేఐలతో కూడిన

➤ మిగతా 2వ పేజిలో..

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

**ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి**

పూర్వాంచల్, అక్టోబర్ 07 ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం

➤ మిగతా 2వ పేజిలో..

## రెపో రేటు 5.50 శాతానికి పెంపు

- 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ
- ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక
- ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం
- ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!!
- 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి
- ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు
- ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్

న్యూఢిల్లీ, అక్టోబర్ 07 ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థి తులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు

➤ మిగతా 2వ పేజిలో..



## 2047 నాటికి వికసిత్ భారత్ సాధన

- పధాని మోదీ పంచసంకల్పాలు
- 'మనం సాధిస్తాం' అంటూ దేశానికి కొత్త నినాదం.. ఐదు కీలక లక్ష్యాల ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 07,తరంగాలు : భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తన 25 ఏళ్ల ప్రజా సేవ పూర్తయిన సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశ భవిష్యత్తు అభివృద్ధికి సంబంధించిన పలు కీలక లక్ష్యాలను ప్రకటించారు.దేశం ఇక చిన్న లక్ష్యాలతో సంతృప్తి చెందకూడదని, భారీ

➤ మిగతా 2వ పేజిలో..



## తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 07: తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావా ట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన

➤ మిగతా 2వ పేజిలో..

# మోదీ కనుసన్నల్లోనే "ఈసీ అక్రమాలు"

- ఓటుహక్కును హరించే కుట్రను అడ్డుకుంటాం: సీఎం రేవంత్‌రెడ్డి
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే
- 'సర్ గో బ్యాక్.. జీకే గో బ్యాక్' ఉద్యమం ఆగదు
- రాహుల్, ప్రియాంకల అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి
- ఇది కాంగ్రెస్ ఉద్యమం కాదు.. ఇండియా కూటమి, ప్రజల ఉద్యమం



న్యూఢిల్లీ, అక్టోబర్ 07,(తరంగాలు ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ కనుసన్నల్లోనే ఎన్నికల సంఘం అక్రమాలకు పాల్పడుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. దేశంలో ఓటుహక్కు ఉన్నవారు, లేనివారు అంటూ ప్రజలను రెండు వర్గాలుగా విభజించి, ప్రజల ఓటుహక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. ఈ కుట్రలో భాగస్వామిగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రాహుల్, ప్రియాంకల అరెస్టుపై ఆగ్రహం

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలపై పోలీసులు వ్యవహరించిన తీరును సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడితో సమానమని అన్నారు. రాహుల్, ప్రియాంకలను పోలీసులు అరెస్టు చేసిన అనంతరం వారిని కలిసేందుకు రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు కేరళ ముఖ్యమంత్రి సతీశన్ ప్రయత్నించగా పోలీసులు గేటు వద్దే అడ్డుకున్నారు. అనంతరం రాహుల్‌గాంధీని మరో గేటు నుంచి

➤ మిగతా 2వ పేజిలో..

## "విద్యా రంగంలో గోల్డెన్ ఓక్ సత్తా.. "డైనమిక్ స్కూల్ అవార్డు కైవసం"




హనుమకొండ ప్రతినిధి , అక్టోబర్ 07, (తరంగాలు): హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్ టుడే ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియన్స్ ఎడ్యుకేషన్ సుమ్మిట్ లో హనుమకొండకు చెందిన గోల్డెన్ ఓక్ స్కూల్ ప్రతిష్ఠాత్మక "డైనమిక్ స్కూల్ అవార్డు "ను అందుకుంది.విద్యా రంగంలో పాఠశాల అందిస్తున్న విశిష్ట సేవలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. పాఠశాల తరపున చైర్మన్ గంట రవికుమార్, ప్రిన్సిపాల్ దీప్తి బసాని అవార్డును స్వీకరించారు.

ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు గోల్డెన్ ఓక్ స్కూల్ విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు స్ఫూర్తినిస్తుందని చైర్మన్ గంట రవికుమార్ తెలిపారు.



## దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..

- తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం!
- ప్రత్యేక బస్సుల ఛార్జీలలో మార్పు

హైదరాబాద్, అక్టోబర్ 07: దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది.ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగకు ప్రత్యేక

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రమాదాల కట్టడికి "4ఈ ఫార్ములా"

- తెలంగాణలో 7 జిల్లాలపై ప్రత్యేక ఫోకస్
- తెలంగాణలో 7 జిల్లాల్లో 48 కీలక ప్రమాద కారిడార్లు గుర్తింపు
- '4ఈ' విధానంతో ప్రమాదాలు, మరణాల కట్టడికి చర్యలు
- హనుమకొండలో పార్కింగ్, లేన్ మార్కింగ్, జీబ్రా క్రాసింగ్‌పై అధికారుల సమీక్ష
- రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా డీజీపీ సి.వి. ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్




హనుమకొండ ప్రతినిధి , అక్టోబర్ 07 (తరంగాలు):

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవిస్తున్న మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో ఏడు జిల్లాలను ఎంపిక చేశారు. ఆయా జిల్లాల్లో ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను సమగ్రంగా విశ్లేషించి, మరణాలను తగ్గించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశిం చారు.ఈ అంశంపై డీజీపీ సీవీ ఆనంద్, రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి బుధవారం డీజీపీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సేఫ్‌లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఎంపిక చేసిన ఏడు జిల్లాల కలెక్టర్లు, నాలుగు పోలీస్ కమిషనరేట్ల పోలీస్

➤ మిగతా 2వ పేజిలో..

# 2047 నాటికి వికసిత్ భారత్ సాధన

ఆశయాలతో ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని మోదీ అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే అంతిమ లక్ష్యమని స్పష్టం చేస్తూ ఐదు ప్రధాన సంకల్పాలను ప్రకటించారు.

మోదీ ప్రకటించిన ఐదు సంకల్పాలు

1) ప్రపంచంలోని టాప్-3 ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను నిలపడం
2) ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించడం
3) భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడం
4) ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వడం
5) అంతరిక్షంలో మానవుడిని అడుగుపెట్టించడం

ప్రధాని ఒక్కో లక్ష్యాన్ని ప్రకటించిన ప్రతిసారీ సభలోని ప్రజలు, కార్యకర్తలు 'మనం సాధిస్తాం' అంటూ ఉత్సాహంగా స్పందించారు. ఈ నినాదం దేశ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు.

### ప్రపంచ సవాళ్ల మధ్య ఆర్థిక స్థిరత్వం

కరోనా మహమ్మారి, రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య సంక్షోభం వంటి అనేక అంతర్జాతీయ సవాళ్ల మధ్య కూడా భారత్ ఆర్థికంగా స్థిరంగా ముందుకు సాగిందని ప్రధాని అన్నారు. గతంలో ప్రపంచంలో సంక్షోభం ఏర్పడితే భారత ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తమయ్యేదని, ప్రస్తుతం భారత్ చూపుతున్న ఆర్థిక స్థైర్యంపై ప్రపంచం చర్చిస్తోందని తెలిపారు.తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేసి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భారత ఆర్థిక శక్తిని మరింత బలోపేతం చేయాలని మోదీ పిలుపునిచ్చారు.భారీ లక్ష్యాలు.. దృఢ సంకల్పం.. సమష్టి కృషితో 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే దేశం ముందున్న ప్రధాన కర్తవ్యమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

## ఈసి నియామకాల తీర్పు రికాల్‌పై పిటిషన్

కమిటీ చేసే సిఫార్సుపై సీఈసీ, ఈసీల నియామకాలను రాష్ట్రపతి చేస్తారని 2023 మార్చి 2న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. సీజేఐ బదులు కేంద్ర మంత్రికి అవకాశమిస్తూ ఆ ఏడాది డిసెంబరులో పార్లమెంటులో చట్టాన్ని రూపొందించడంతో దాని రాజ్యాంగబద్ధ చెల్లుబాటును పలువురు సవాల్ చేశారు. ఈ పిటిషన్లను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా? అనే అంశంపై సెప్టెంబర్ 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ అంశంపై ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఫలితంగా భిన్నమైన తీర్పులు వెలువడ్డాయి. ఈ కేసును మరింత విస్తృతమైన రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలని కేంద్రం కోరింది. అయితే జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ అభ్యర్థనను తిరస్కరించారు. ఎంపిక కమిటీలో ఒక క్యాబినెట్ మంత్రిని చేర్చడం వల్ల దాని తటస్థ స్వరూపం పోతుంది. 2023 చట్టం కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ అధికారాన్ని కట్టబెడుతుందని అభిప్రాయపడ్డారు. విపక్ష నేత ఉనికి నామమాత్రం అవుతుందని, కమిటీలో ఆయనను చేర్చిన ఉద్దేశం అలంకారప్రాయంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కానీ, జస్టిస్ దత్తా వ్యాఖ్యను వ్యతిరేకిస్తూ, కేంద్ర వాదనను జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఏకీభవించారు. ఆర్టికల్ 145(3) ప్రకారం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం అధికారికంగా నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో తదుపరి చర్యల కోసం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వద్దకు పరిపాలనా పరంగా పంపాలని ద్విసభ్య ధర్మాసనం నిర్ణయించింది. తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, అంశంపై సమర్థవంతమైన, తుది నిర్ణయం తీసుకునేలా చేయాలని సూచించింది.

## రెపో రేటు 5.50 శాతానికి పెంపు

పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్కుల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు.

మరోవైపు రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# ప్రమాదాల కట్టడికి "4ఈ ఫార్ములా"



కమిషనర్లు, సంబంధిత యూనిట్ అధికారులు పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ప్రమాద స్థలాలపై సమగ్ర విశ్లేషణ

ప్రతి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలు, ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న సమయాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మార్గదర్శక్ పోర్టల్, డ్యాష్‌బోర్డులో నమోదు చేయాలని డీజీపీ సూచించారు. అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించడం ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవచ్చని తెలిపారు.

దేశవ్యాప్తంగా ఏటా సుమారు 1.75 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో ఏటా 7 వేల మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. ప్రమాదాల మరణాల విషయంలో తెలంగాణ దేశంలో ఏడో స్థానంలో ఉందన్నారు.

ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనికి సంబంధించి త్వరలో జీవో వెలువడుతుందని వెల్లడించారు.

### 48 కీలక ప్రమాద కారిడార్లు

తెలంగాణలోని మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో ప్రత్యేక రోడ్డు భద్రతా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు.

2024, 2025 ఈ - డార్ గణాంకాల ఆధారంగా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించారు. ఈ ఏడు జిల్లాల్లో మొత్తం 48 కీలక ప్రమాద కారిడార్లు, నాలుగు లేదా అంతకంటే ఎక్కువ మరణాలు నమోదైన 230 ప్రాధాన్య-1 ప్రాంతాలు, 220 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు, 183 కీలక పాదచారుల ప్రమాద ప్రాంతాలు గుర్తించారు.

సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 14 కీలక కారిడార్లు ఉండగా, రంగారెడ్డి జిల్లాలో 98 ప్రాధాన్య ప్రమాద ప్రాంతాలు, 99 ట్రాఫిక్ ఉల్లంఘన ప్రాంతాలు, 66 పాదచారుల ప్రమాద ప్రాంతాలు ఉన్నట్లు కార్యాచరణ ప్రణాళికలో గుర్తించారు.ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలు, సమయాలు, రహదారి నిర్మాణం, ఇంజినీరింగ్ లోపాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.

### '4ఈ' విధానంతో ప్రమాదాల కట్టడి

రోడ్డు ప్రమాదాల నివారణలో '4ఈ' విధానాన్ని అమలు చేయనున్నట్లు డీజీపీ తెలిపారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సపోర్ట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు, ప్రమాదాలకు కారణమవుతున్న రహదారి లోపాలను గుర్తించి సరిదిద్దాలని ఆదేశించారు.

### ప్రతి ప్రమాదం నమోదు

రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ ఎలక్ట్రానిక్ డిజిటల్ యాక్సిడెంట్ రిపోర్ట్ నమోదు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. మార్గదర్శక్ పోర్టల్‌లో ప్రమాదాలు, గాయపడిన వారి వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు.

ప్రమాద ప్రాంతాల జియోట్యాగ్ ఫొటోలను కూడా మార్గదర్శక్ పోర్టల్ డ్యాష్‌బోర్డులో నమోదు చేసే అవకాశం ఉందని వివరించారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను సమావేశంలో వివరించారు.

### నవంబర్ 3న చెన్నైలో ప్రజెంటేషన్

నవంబర్ 3న చెన్నైలో జరగనున్న సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు, రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు, మరణాలు అధికంగా నమోదవుతున్న ఏడు జిల్లాల్లో చేపట్టిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ సూచించారు.

సుప్రీంకోర్టు నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదాల సంఖ్యతో పాటు ముఖ్యంగా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

### వరంగల్ నగరంలో పార్కింగ్ సమస్యకు పరిష్కారం

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వరంగల్ నగరంలో పార్కింగ్ సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అధికారులతో సమీక్షించారు.

నగరంలో పార్కింగ్, నో-పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి స్పష్టమైన సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రధాన రహదారులపై లేన్ మార్కింగ్, జంక్షన్ల వద్ద జీబ్రా క్రాసింగ్, అవసరమైన సూచిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, నేషనల్ హైవేస్ వరంగల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎన్‌హెచ్ ఈఈ కిరణ్ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ దేవిక చౌహాన్, జిల్లా రవాణాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, సిటీ ప్లానర్ రవీంద్ర రెడేకర్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ చేరాలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## మోదీ కనుసన్నల్లోనే "ఈసీ అక్రమాలు"

బయటకు పంపారని తెలిపారు.

### తప్పు చేసిన వారిని వదిలి ప్రతిపక్ష నేతల అరెస్టులా?

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే, ఆయనపైనే చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గేలను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ, అమిత్‌షాల అసహనం పోలీసుల వ్యవహారశైలిలో స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు.

### 'సర్ గో బ్యాక్.. జీకే గో బ్యాక్' ఉద్యమం

స్వాతంత్ర్య పోరాట కాలంలో 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు దేశంలో 'సర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఈ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. గతంలో రైతుల ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించినప్పటికీ చివరకు ప్రజల ఒత్తిడికి తలొగ్గి చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు.

### ప్రజల ఓట్లతో ఆటలాడితే ఊరుకునేది లేదు

ప్రజల ఓట్లను తొలగించి ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుని తీరుతుందని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైన హక్కు అని, ఆ హక్కును హరించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. అవసరమైతే ఈ పోరాటం మరింత ఉధృతమై ప్రధాని రాజీనామా చేయాల్సిన పరిస్థితి కూడా రావచ్చని వ్యాఖ్యానించారు.

వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం

దేశంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని సీఎం అన్నారు. ప్రజల హక్కులను కాలరాసిన వారు చరిత్రలో ఎవరూ తప్పించుకోలేదని, చివరకు ప్రజల కోర్టులోనే తీర్పు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఇది కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఉద్యమం కాదని, ఇండియా కూటమి ఉద్యమమని, అంతకుమించి ప్రజల హక్కుల కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలంతా ఒక్కటై గొంతెత్తితే ప్రభుత్వం తప్పనిసరిగా వినాల్సిందేనని స్పష్టం చేశారు.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

సంభవించింది. రహదారిపై ఆగి ఉన్న ఒక ట్రక్కును కారు వెనుక నుంచి అతివేగంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారందరినీ టెన్నిస్ క్రీడాకారులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, అయోధ్య పరిధిలోని 97.500 మైలురాయి వద్ద బుధవారం వేకువజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నోలో నిర్వహించిన ఒక టెన్నిస్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆరుగురు యువకులు తిరిగి దేవరియాకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం ధాటికి కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. వాహనంలో చిక్కుకున్న వారిని యూపీఈఐడీఏ భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు అతికష్టం మీద వెలికితీశారు.

## దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..

సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు) , ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పందల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజిఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.

## తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

# తమ్మడపల్లి జీలో ఘనంగా పోషణమాసం కార్యక్రమాలు



**జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 7,(తరంగాలు):**మండలం లోని తమ్మడపల్లి జీ గ్రామంలో సర్పంచ్ అన్నం స్వప్నరాణిబ్రహ్మారెడ్డి , ఉప సర్పంచ్ ముక్కెర గంగరాజు ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా ఉప సర్పంచ్ ముక్కెర గంగరాజు , అంగన్వాడీ సూపర్ వైజర్ అనిత , వార్డు సభ్యులు సొన్నాయిల నాగరాజు గర్భిణులు, బాలింతలు, 3టి6 సం. తల్లితండ్రులు, ఆశా వర్కర్ అరుణ, అంగన్వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, రేణుక, స్వప్న, ఆయాలు రాజపూల, బుజ్జమ్మ, ఉమారాణి తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. ఇందులో భాగంగా పౌష్టికాహారం గుడ్లు, పాలు, ఆకుకూరలు తీసుకోవాలనఈ సందర్భంగా గర్భిణులకు శ్రీమంతాలు చేయడం జరిగింది.

# వ్యవసాయ సర్వీస్ వైర్ల చోరీకి పాల్పడుతున్న నలుగురు అరెస్ట్

**•రెండు మోటార్‌సైకిళ్లు, 25 కిలోల కాల్చిన కాపర్ వైర్ స్వాధీనం**



**రఘునాథపల్లి,అక్టోబర్,7(తరంగాలు న్యూస్)**
జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ బావులు, బోర్లకు సంబంధించిన సర్వీస్ వైర్లను చోరీ చేస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రెండు మోటార్‌సైకిళ్లతో పాటు సుమారు 25 కిలోల కాల్చిన కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న బావులు, బోర్లకు సంబంధించిన సర్వీస్ వైర్లను కొంతకాలంగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వైర్ల చోరీపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేపట్టారు.విచారణలో భాగంగా అనుమానితుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి చోరీకి సంబంధించిన రెండు మోటార్‌సైకిళ్లు, సుమారు 25 కిలోల కాల్చిన కాపర్ వైర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన సర్వీస్ వైర్ల నుంచి కాపర్‌ను వేరు చేసేందుకు వాటిని కాల్చినట్లు పోలీసులు గుర్తించారు.అరెస్టయిన నిందితులు: జనగామలోని ఎరుకల అంబేద్కర్‌నగర్‌కు చెందిన గంట రాజు (45), తండ్రి మునుస్వామి, ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా ఎరుకల గిద్దలూరు గ్రామానికి చెందిన కావడి సంజీవరాజు (23), తండ్రి ఏలియా, జనగామ ఎరుకల రాజీవ్‌నగర్‌కు చెందిన మద్దెల శ్రీను (40), తండ్రి అమరయ్య, జనగామ ఎరుకల అంబేద్కర్‌నగర్‌కు చెందిన శీలం మహేష్ (25), తండ్రి రాంబాబు ఉన్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న రెండు మోటార్‌సైకిళ్లు, 25 కిలోల కాల్చిన కాపర్ వైర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.వ్యవసాయ బావులు, బోర్లకు సంబంధించిన సర్వీస్ వైర్ల చోరీలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రైతులు తమ వ్యవసాయ మోటార్లు, విద్యుత్ వైర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ శ్రేణుల చేరిక



**రఘునాథపల్లి,అక్టోబర్, 7(తరంగాలు న్యూస్)**
జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం లోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బుధవారం పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్చార్జి ముసిపట్ల విజయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన 100 మందికి పైగా కార్యకర్తలు తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య కండువాలు కప్పి టిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. రాజయ్య నూతనంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచ్ అభ్యర్థి పిట్టల శ్రావణ, యాదగిరి, కొన్నే సంజీవ, వెంకటేష్‌తో ఉన్నారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై. కుమార్ గౌడ్, జిల్లా నాయకులు లొక్కుట్ల సృజన్, జిల్లా యువజన నాయకులు దుబ్బాక హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పురుగు మందుల కంపెనీ తప్పుడు సలహాతో మిర్చి తోట దగ్ధం





**• లబోదిబోమంటున్న రైతు కంపెనీ ప్రతినిధుల ఓవర్ డోస్ సిఫార్సుతో మాడిపోయిన పంట**

**• బాధితుడికి న్యాయం చేయాలని రైతు ప్రజా సంఘాల డిమాండ్**

**• పంటను పరిశీలించిన ఏఈవో సరిత**

**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 7(తరంగాలు ):**
మహబూబాబాద్ జిల్లా బేతోల్ గ్రామ వ్యవసాయ రసాయనాల కంపెనీ ప్రతినిధులు ఇచ్చిన తప్పుడు మోతాదు సలహా కారణంగా తాను ఎంతో కష్టపడి సాగు చేసిన మిర్చి తోట పూర్తిగా మాడిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డుబేతోలు భజన తండాకు చెందిన రైతు గుగులోతు సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు.బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం తన మిర్చి పంటకు అవసరమైన పురుగు మందు కోసం ఆన్‌లైన్/ఫోన్ ద్వారా సంప్రదించగా హైదరాబాద్‌కు చెందిన సాఖ రెడ్డి కెమికల్స్ (రంగారెడ్డి / హైదరాబాద్ - బోరాన్ కంపెనీ ) ప్రతినిధులు కొరియర్ ద్వారా మందును పంపించారు సాధారణంగా ఆ మందును 30 నుంచి 40 డ్రమ్ముల నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉండగా సదరు కంపెనీ ప్రతినిధులు మాత్రం కేవలం 5 డ్రమ్ములలోనే (2 కేజీల మందును 20 డ్రమ్ములకు బదులు 400 గ్రాములు 60 లీటర్ల నీటిలో) కలిపి పిచికారీ చేయాలని తప్పుడు సలహా ఇచ్చారుకంపెనీ వారు చెప్పిన అధిక మోతాదు (ఓవర్ డోస్) కారణంగా మందు పిచికారీ చేసిన కొద్దిసేపట్లోనే మిర్చి తోట పూర్తిగా మాడిపోయి ఎండిపోయింది కంపెనీ ప్రతినిధుల నిర్లక్ష్యం అవగాహనారాహిత్యం వల్లే లక్షలాది రూపాయల పంట సర్వనాశనమై రోడ్డున పడ్డానని రైతు కన్నీరుమున్నీరయ్యారు ఈ విషయమై జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి రైతు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా వ్యవసాయ విస్తరణ అధికారిణి (ఇాజుూ) సరిత ఘటనా స్థలానికి చేరుకుని దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలించారు అనంతరం రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి నల్లపు సుధాకర్ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, రైతుతో కలిసి మాట్లాడారు అమాయక రైతులను తప్పుదోవ పట్టిస్తూ పంట నష్టానికి కారణమైన సదరు కెమికల్ కంపెనీపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు పంట నష్టపోయిన రైతు సీతారాంకు కంపెనీ నుంచి తగిన పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులను ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో భూక్య రాంజీ షేక్ ఖాదర్ బాబా భూక్య అర్జున్ భూక్య మన్సూర్ గుగ్గులోతు హచనా తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య





**• త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం**

**ఇల్లందు ప్రతినిధి, అక్టోబర్ 7,( తరంగాలు):** ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఏర్పాటుచేసిన ఇల్లందు మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్వోత్తమ్ రెడ్డిని ప్రకటించడం జరిగిందని, స్వర్గీయ రాంరెడ్డి వెంకట రెడ్డి దామన్న కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి ని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఆది నుండి అంతం వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉండి కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్న కుటుంబానికి కాంగ్రెస్ శ్రేణులంతా అండగా నిలబడి సర్వోత్తమ్ రెడ్డి ని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఇల్లందు మండలంలో ప్రతి గ్రామంలో గ్రాడ్యుయేట్ పూర్తయిన యువత వద్దకు వెళ్లాలని, వారి ఓటు హక్కును నమోదు చేయించి , గతంలో ఓటు వేసిన వారిని మరల రెన్యువల్ చేసుకోవాలని గుర్తు చేయాలన్నారు. అన్ని పార్టీల వారు ఎమ్మెల్సీ ఎలక్షన్స్ దగ్గర పడుతున్న తరుణంలో ఫ్రీగా ఓటు నమోదు చేయిస్తామని బయట చెప్పుకుంటున్నారని అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ప్రతి అర్హుడైన పేదవాడికి ప్రతి కుటుంబానికి సన్నబియ్యం, స్మార్ట్ రేషన్ కార్డు,ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు,ఇందిరమ్మ ఇల్లు వంటి అన్ని పథకాలను ఉచితంగానే ఇస్తుందన్నారు.. అలాగే యువతకి ప్రజా ప్రభుత్వ ఏర్పడిన తర్వాత 70 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఒక కాంగ్రెస్ పార్టీకే సొంతం అని, త్వరలో మరలా ఉద్యోగాలు ఇవ్వబోతున్నాం కొన్నిటికి నోటిఫికేషన్లు ఇచ్చాం అని తెలిపారు.త్వరలో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయబోతున్నాం అన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీల వారు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు కేవలం ఉచితంగానే ఇస్తారు తప్ప, గత బిఆర్ఎస్ పది ఏళ్ళ పాలన,బిజెపి గత 15 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉచితంగా ఇచ్చింది ఏమి లేదని, అభివృద్ధి కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ మండల రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ భానోత్ రాంబాబు,ఎట్టి హరికృష్ణ, సర్పంచ్ పాయం స్వాతి, సర్పంచ్ భానోత్ శారద, మోకాళ్ళ వెంకటమ్మ, మండలంలోని ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అండర్-14 మహిళల క్రికెట్‌కు విద్యాశ్రీ ఎంపిక

**• రాబోయే టోర్నమెంట్లలో రాణించాలని అజయ్ సారధి రెడ్డి ఆకాంక్ష**

**మహబూబాబాద్, అక్టోబర్ 07 (తరంగాలు):**
మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగొండ గ్రామానికి చెందిన బాదావత్ విద్యాశ్రీ అండర్-14 మహిళల క్రికెట్‌కు ఎంపికయ్యారు. ఇటీవల ములుగు జిల్లా జాకారం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన సెలక్షన్స్‌లో విద్యాశ్రీ ప్రతిభ కనబరిచి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహిళల క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. అజయ్ సారధి రెడ్డి తెలిపారు.త్వరలో జరగనున్న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహిళల క్రికెట్ టోర్నమెంట్‌లో విద్యాశ్రీ పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.సమ్మర్ కోచింగ్ క్రికెట్ క్యాంపుల ద్వారా విద్యార్థులకు క్రికెట్‌లో మెలకువలు నేర్పిస్తూ వారి ప్రతిభను వెలికితీస్తున్నామని అజయ్ సారధి రెడ్డి తెలిపారు. విద్యాశ్రీ ఎస్‌జీఎఫ్‌కు ఎంపిక కావడం పట్ల ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాబోయే టోర్నమెంట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యాశ్రీ ఎంపిక పట్ల మహబూబాబాద్ జిల్లా క్రికెట్ చీఫ్ కోచ్ మెతుకు కుమార్, సహాయ కోచ్ తోట వినయ్ కుమార్, సహాయకులు బి. సాత్విక్ రెడ్డి, పిట్టల రావణ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



# అందరం కలిసి నడుస్తేనే నల్లగొండ అభివృద్ధి సాధ్యం





- పాలకూరి రవి గౌడ్

**నల్గొండ-- అక్టోబర్ 7,( తరంగాలు):** నల్గొండ జిల్లాలో గత నెల రోజులుగా జరుగుతున్న పరిణామాలు ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరినీ కలవరపెడుతున్నాయి.జిల్లాలో భారతీయ జనతా పార్టీ రోజురోజుకూ బలపడుతోంది. యువత, మహిళలు పెద్ద ఎత్తున బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారు. రాబోయే ఎన్నికల్లో నల్గొండ గడ్డపై కాషాయ జెండా ఎగురుతుందనే నమ్మకంతో జిల్లా శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్న ఈ తరుణంలో, బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి కుటుంబంపై జరిగిన దాడి తీవ్రంగా కలచివేసింది.గత నెలలో వారి తల్లిగారైన నాగం శ్రీదేవి నివాసంపై కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడి, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారనే విషయం తెలిసినదే నల్గొండలో ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు కూడా ఎంతో బాధపడ్డారు.

ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీకోటి ప్రవీణ్ కుమార్ నిన్న మాట్లాడుతూ ఇది వ్యక్తిగత కక్ష కాదు, రాజకీయ కక్ష అని అన్నారు. నల్గొండలో బీజేపీ అభివృద్ధిని తట్టుకోలేకనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన అన్న మాటల్లో 100% వాస్తవం ఉంది.

నాగం వర్షిత్ రెడ్డి జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఒక యువకుడిగా యువతను ఆకట్టుకునే విధంగా పనిచేస్తున్నారు. తన సొంత హాస్పిటల్ పై ఎన్నో ఇబ్బందులు పెట్టినా, చివరకు తన హాస్పిటల్ ను కూడా వదులుకొని కేవలం ప్రజా సేవకే అంకితమయ్యారు. రాజకీయాల్లో విమర్శలు, తగాదాలు వస్తుంటాయి. ఇవన్నీ వస్తున్నా వాటిని తట్టుకుంటూ, అందరినీ మళ్లీ కలుపుకుంటూ ముందుకు వెళ్తున్న వ్యక్తి . ఈ క్షణం నుంచి మనం అందరం కలిసి పోదాం, నల్గొండ గడ్డపై కాషాయ జెండా ఎగురవేద్దాం" అనే ఆలోచన కలిగిన వ్యక్తిపై ఈ దాడి జరగడం బాధాకరం.కార్యకర్త నుండి జాతీయ నాయకుల వరకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

ఈ ఘటన జరిగినప్పటి నుండి ఇప్పటివరకు కార్యకర్త స్థాయి నుండి జాతీయ నాయకుల వరకు ప్రతి ఒక్కరూ నాగం వర్షిత్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచారు. వారి తల్లిగారైన నాగం శ్రీదేవి ని వ్యక్తిగతంగా కలిసి పరామర్శించి, వారి కుటుంబానికి ధైర్యాన్ని కల్పించారు. "ప్రజాసేవలో మీరు ఇంకా ముందుకు వెళ్లండి, నల్గొండ జిల్లాలో బీజేపీ జెండా ఎగరవేయడానికి కృషి చేయండి, మీ వెంట మేముంటాం" అని భరోసా ఇచ్చిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.నిన్న చీకోటి ప్రవీణ్ కుమార్ మాట్లాడిన ప్రతి పాయింట్ ను నేను గమనించాను. ఆయన చాలా అద్భుతంగా మాట్లాడారు. ప్రతి విషయాన్ని లోతుగా అర్థం చేసుకుని, నల్గొండ జిల్లాలో ఏం జరుగుతుందో స్పష్టంగా తెలియజేశారు. ఆ విషయంపై స్పందించాలనిపించే నా అభిప్రాయాన్ని ఈ విధంగా మీ అందరి దృష్టికి తీసుకొస్తున్నాను.

# ప్రభుత్వ ధరలకే పత్తి కొనుగోలు చేయాలి



- జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ మార్కెటింగ్, వ్యవసాయ, అనుబంధ శాఖలకు ఆదేశాలు

**నల్గొండ -- అక్టోబర్ 7,( తరంగాలు )** 2026- 27 పత్తి మద్దతు ధర సేకరణపై బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ ఖరీఫ్ లో జిల్లాలో సుమారు 5 లక్షల 93,795 ఎకరాలలో పత్తి సాగు అవ్వగా, 3 లక్షల 56 వేల 257 మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్ కి వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారు లు నివేదిక సమర్పించడం జరిగిందని, అందుకు తగ్గట్టుగా పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పత్తి కొనుగోలుకు జిల్లాలో 26 జిన్నింగ్ మిల్లులు ఉండగా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 10 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి సిసిఐ ద్వారా క్వింటాలుకు 8667 /- రూపాయల మద్దతు ధరను ప్రకటించింది. తేమశాతం 8 వరకు ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వస్తుందని తెలిపారు. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పత్తి రైతులు ఇబ్బందులు పడకుండా కిసాన్ కపాస్ యాప్ ,అలాగే పత్తి మద్దతు ధర పొందేందుకు నాణ్యత ప్రమాణాల పై విస్తృత ప్రచారం కల్పించాలని, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా పత్తి పండించిన ప్రతి రైతుకు పై విషయాలతో పాటు, పత్తి కొనుగోలు కేంద్రాల వివరాలు, పత్తిని కొనుగోలు చేసే రోజులు, సెలవు రోజుల వివరాలన్నింటినీ ముందుగానే తెలియజేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ముందుగానే నెల రోజుల షెడ్యూల్ ను, అలాగే మద్దతు ధర వివరాలు, తేమశాతం తదితర వివరాలన్నింటినీ ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు . జిన్నింగ్ మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి ప్రైవేట్ గా పత్తిని కొనుగోలు చేసి రైతులకు లాభం చేకూర్చాలని, ఎల్ నినో పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మానవతా దృక్పథంతో రైతులకు సహకరించాలని, అదేవిధంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కూడా పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ కోరారు.

అన్ని పత్తి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా టాయిలెట్లు, తాగునీరు, రైతులు వేచి ఉండేందుకు నీడ, అవసరమైతే రాత్రి సమయంలో గడిపేందుకు వసతి, మైకు ఏర్పాటు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద పోలీస్ పికటింగ్ ,సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పత్తి అమ్మిన రైతులకు తక్షణమే చెల్లింపులు చేసేలా సిసిఐ అధికారులు చర్యలు తీసుకోవాలని, పత్తి కొనుగోలు ముగిసే వరకు మార్కెటింగ్ శాఖ సెక్రెటరీలు, సిబ్బందికి ఎలాంటి సెలవులు మంజూరు చేయడం జరగదని కలెక్టర్ వెల్లడించారు. కపస్ కిసాన్ ఆప్ ,పత్తి కొనుగోలు నాణ్యత ప్రమాణాలపై ఈనెల 8న జిల్లాలోని ఏఈఓ లకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు . పత్తి కొనుగోలు కేంద్రాలలో సీసీఐతో పాటు, జిన్నింగ్ మిల్ యజమానులు తేమశాతం వచ్చిన వెంటనే పత్తిని కొనుగోలు చేసేలా చూడాలని ,ఈ సంవత్సరం ఎల్ నినోవల్ల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా తేమతో ఎలాంటి ఇబ్బంది ఉండదని, ప్రతి రెండు రోజులకు ఒకసారి తేమను తనిఖీ చేసేలా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పత్తి జిన్నింగ్ మిల్లుల యజమానులు మాట్లాడుతూ పత్తి స్లాట్ బుకింగ్ లో సమస్యలు ఉన్నాయని ,జిన్నింగ్ మిల్లుల సామర్థ్యాన్ని బట్టి మిల్లులకు పత్తిని కేటాయించాలని , డిండి, చారగొండ ప్రాంతంలో ట్రాన్స్పోర్ట్ పేరుతో స్థానికులు కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఎవరైనా ట్రాన్స్పోర్ట్ పేరుతో మిల్లర్లు , వాహనదారులు, రైతులనుండి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని, ఈ విషయంపై ప్రత్యక్షంగా తనిఖీ చేసి వివరాలు సమర్పించాలని జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారిని ఆదేశించారు. స్థానిక పోలీస్ అధికారులు కూడా ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు.

పత్తి కొనుగోలుకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక తహసిల్దార్ ,మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, పోలీసు సబ్ ఇన్స్పెక్టర్, మార్కెటింగ్ సెక్రటరీ, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి, అలాగే రైతుల తరఫున ఒకరితో తక్షణమే స్థానిక కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద రెండు రోజుల్లో సమావేశాలు నిర్వహించి కపాస్ కిసాన్ ఆప్ ,పత్తి నాణ్యత ప్రమాణాలపై పత్తి రైతులకు తెలియజేయాలని, కొనుగోలు కేంద్రాలు లేని చోట తహసిల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రమేష్ ,
సిసిఐ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ దిలీప్ ,మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిన్నింగ్ మిల్లుల యజమానులు, మార్కెటింగ్ ,లీగల్ మెట్రాలజీ, ఫైర్, ట్రాన్స్పోర్ట్ శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

జారీ చేసిన వారు సహాయ సంచాలకులు, సమాచార శాఖ నల్గొండ.



## వంద మంది చేరారనడం అవాస్తవం

- వంద మంది చేరారనడం అవాస్తవం
- బీఆర్ఎస్ నేతలు అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి కోళ్ల రవి గౌడ్



**రఘునాథపల్లి:అక్టోబర్, 7(తరంగాలు న్యూస్)** రఘునాథపల్లి మండలంగోవర్ధనగిరి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలపై ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారాలను మానుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోళ్ల రవి గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గోవర్ధనగిరి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు బీఆర్ఎస్ పార్టీలో చేరితే, 100 మంది పార్టీలో చేరినట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు.బీఆర్ఎస్ నాయకులకు నిజంగా 100 మంది పార్టీలో చేరినట్లు ఆధారాలు ఉంటే, ఆ వంద మంది పేర్లను బహిర్గతం చేయాలని ఆయన సవాల్ విసిరారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయకుండా తప్పుడు ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సరికాదన్నారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని కోళ్ల రవి గౌడ్ సూచించారు.

## ఇనుప విద్యుత్ స్తంభాల సమస్యకు పరిష్కారం

- దత్తాయిపల్లిలో 11 ప్రమాదకర స్తంభాల తొలగింపు.. కొత్త సిమెంట్ స్తంభాల ఏర్పాటు



**యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 7 (తరంగాలు):** దత్తాయిపల్లి గ్రామంలో గత కొన్నేళ్లుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇనుప విద్యుత్ స్తంభాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇటీవల మార్నింగ్ వాక్‌లో భాగంగా గ్రామంలో పర్యటించిన సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్‌తో పాటు ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాల సమస్యను గుర్తించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాలతో తుర్కపల్లి విద్యుత్ శాఖ ఏఈ బిక్షపతి స్పందించి చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ పనులు చేపట్టడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న 11 ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు.సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, విద్యుత్ శాఖ ఏఈ బిక్షపతికి సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పనులకు సహకరించిన ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రామ పంచాయతీ తరపున పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

## షాపెల్లి గ్రామంలో భూముల సర్వే ప్రారంభించిన సర్పంచ్



**జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 7,(తరంగాలు):** మండలం లోని షాపల్లి గ్రామంలో సర్పంచ్ తాళ్ల పెల్లి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన భూముల సర్వే దానిపై గ్రామసభ నిర్వహించడం జరిగింది. గ్రామ సభలో షాపెల్లి గ్రామంలోని భూములను సర్వే చేయుటకు సర్వేల ద్వారా గ్రామం మొత్తం సర్వే ప్రారంభించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్, డి ఐ మహేందర్ సర్వేయర్ రోజా, జిపిఓ గోపాల్, గ్రామ కార్యదర్శి చలపతి, వార్డ్ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది

## మహబూబాబాద్ నుంచి తెలంగాణకు ఆరోగ్య సందేశం

- ఫిట్‌నెస్ బాటలో ఎమ్మెల్యే మురళి నాయక్





**మహబూబాబాద్‌జిల్లాఅక్టోబర్ 07(తరంగాలు** అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మాజీ జాతీయ క్రీడాకారుడు లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం పిలుపు మేరకు ఖేలో ఇండియా బంధన్ తెలంగాణ బంధన్ ఫిట్‌నెస్ ఛాలెంజ్ ను మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళి నాయక్ స్వీకరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో ఫిట్‌నెస్ వాకింగ్ వ్యాయామంపై అవగాహన పెరగాలని ప్రజాప్రతినిధులు స్వయంగా ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు స్ఫూర్తినివ్వాలని పిలుపునిచ్చారు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు మహబూబాబాద్ నుంచి మొదలైన అడుగు తెలంగాణ ఆరోగ్య బంధంగా మారాలని వాకింగ్ చేద్దాం ఆరోగ్యంగా ఉందామని అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేంద్రం కోరారు.

# కుష్ఠు వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలి





- ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే వ్యాధి పూర్తిగా నయం

**మహబూబాబాద్, అక్టోబర్ 7 (తరంగాలు):** మహబూబాబాద్ జిల్లాను కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా కొనసాగించేందుకు అన్ని స్థాయిల ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కేంద్ర పరిశీలకులు డాక్టర్ భాగ్యజ్యోతి, తెలంగాణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు, రాష్ట్ర లెప్రసీ అధికారి డాక్టర్ రాజు సూచించారు.కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబాబాద్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సమీక్షా సమావేశం, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుష్ఠు వ్యాధి గుర్తింపు, చికిత్స, నివారణ, నిర్మూలన కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.అనంతరం ఐడీఓసీలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. చర్మంపై కనిపించే అనుమానిత మచ్చలను పరిశీలించడం, ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించడం, అనుమానిత కేసులను వైద్య పరీక్షలకు పంపించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి అవసరమైన చికిత్స అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా 5 నుంచి 18 ఏళ్ల వయస్సు గల పాఠశాల విద్యార్థుల్లో కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించి, అనుమానిత కేసులను వెంటనే వైద్య పరీక్షలకు పంపించాలని ఆర్‌బీఎస్‌కే సిబ్బందికి సూచించారు. అవసరమైన సందర్భాల్లో పిల్లల కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తే వ్యాధిని నయం చేయవచ్చని డాక్టర్ జాన్‌బాబు, డాక్టర్ భాగ్యజ్యోతి తెలిపారు. ప్రజల్లో కుష్ఠు వ్యాధిపై అవగాహన పెంచడంతో పాటు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు వేగవంతం చేయాలి





- -బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ సన్నాహాలు

**వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 07,తరంగాలు** :ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు.వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఖిలా వరంగల్ మండలంలో బీజేపీ సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ కర్నే రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.అర్హులైన పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఓటర్లకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాలని, పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో బీజేపీ ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి అర్జున్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కర్నే వాసుదేవ్, సీనియర్ నాయకులు కత్తి సాంబయ్య, శ్రీరామ్ నాగరాజు, ఏలుగు రవికుమార్, గందే గోపి, సర్గ సంజీవ్, రావుల రాజేశ్వర్, పాలపోయిన వర్షిత్, కార్తీక్, వంశీ, వరుణ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# లండన్ నుంచి సొంతగడ్డకు

- ఎంఎస్ పూర్తి చేసిన అబ్దుల్ ఖుద్దూస్ కు ఎమ్మెల్సీ రవీందర్ రావు అభినందన



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 07(తరంగాలు ):** యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ లో ఎంఎస్ పూర్తి చేసి మహబూబాబాద్ కు విచ్చేసిన మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ డా. తక్కెళ్లపల్లి రవీందర్ రావును మర్యాదపూర్వ కంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్ రావు శాలువాతో సత్కరించి ఎంఎస్ విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు విద్యాభ్యాసంతో పాటు లండన్ లోని భారత హైకమిషన్ బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ లో తెలంగాణ మహబూబాబాద్ జిల్లాకు సంబంధించిన అంశాలను ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమని కొనియాడారు ఎన్నారై-బిఆర్ఎస్ యూకే యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా యువతను చైతన్యపరుస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న తీరును ప్రశంసించారు విద్యారంగంలో సాధించిన విజయాలు సామాజిక అంశాలపై చూపుతున్న ఆసక్తి యువతకు స్ఫూర్తిదాయకమని భవిష్యత్తులో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలి: డా. వన్నాల వెంకటరమణ



**వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 07 (తరంగాలు):** ప్రజాసేవ అనేది పదవులకు పరిమితం కాదని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన సేవా భావమని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు.25 సంవత్సరాల ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రతీకగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా వరంగల్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ నాయకులు, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.వరంగల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని కార్యకర్తలు, యువత, ప్రజలతో కలిసి వీక్షించారు. ప్రజలను కేంద్రంగా చేసుకుని పరిపాలన సాగించాలని, అధికారంలో ఉన్నా లేకున్నా సేవా దృక్పథాన్ని కొనసాగించాలని ప్రధాని పిలుపునిచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా డా. వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని, సామాజిక బాధ్యతతో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ వరకు కాగడాలతో సేవా యాత్ర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, బాకం హరీష్ శంకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, డా. కంభంపాటి పుల్లారావు, రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్, జలగం రంజిత్ రావు, సిద్ధం నరేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు టేకుమట్ల రేణుక తదితరులు పాల్గొన్నార



# డిజిటల్ అరెస్ట్ అంతా బూటకం భయపడితే డబ్బు ఖతం



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 07(తరంగాలు ):** మహబూబాబాద్ జిల్లా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా.శబరీష్ ఐపీఎస్ పిలుపునిచ్చారు కురవి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పోస్టర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగలు ఆఫర్ల పేరుతో వచ్చే నకిలీ లింకులు భారీ బహుమతులు లక్కీ డ్రా మెసేజ్ లను నమ్మవద్దని హెచ్చరించారు తెలియని లింకులపై క్లిక్ చేయడం యాప్ లను డౌన్లోడ్ చేయడం వల్ల బ్యాంకు డబ్బు క్షణాల్లో మాయమవుతుందని తెలిపారు పోలీసులు సీబీ ఈడీ పేరుతో వీడియో కాల్ చేసి బెదిరించే డిజిటల్ అరెస్టులు పూర్తిగా మోసపూరితమని నిజమైన అధికారులు ఎప్పుడూ వీడియో కాల్ లో అరెస్ట్ చేయరని డబ్బులు అడగరని స్పష్టం చేశారు అలాంటి కాల్స్ వస్తే వెంటనే కట్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు సోషల్ మీడియాలో ఫోటోలు పాస్ వర్డ్ లు ఓటీపీలు పంచుకోవద్దని బంధువుల పేరుతో డబ్బులు అడిగే మెసేజ్ లు వస్తే ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని సూచించారు ఆన్ లైన్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు రూరల్ సీఐ అంజలి ఎస్ఐ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మొక్కల్లోనే మనిషి జ్ఞాపకం

- కానుగ మొక్కలు పంపిణీ చేసిన హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 07( తరంగాలు ):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన ఐలపాక ఐలయ్య జ్ఞాపకార్థం హరిత మిత్ర అవార్డు గ్రహీత ప్రజా హృదయం సేవా సంస్థ అధ్యక్షులు దైద వెంకన్న కానుగ మొక్కలను పంపిణీ చేశారు ఐలయ్య కుమారులు అశోక్ అనిల్ లకు మొక్కలను అందజేసి ఆయన జ్ఞాపకం మొక్కల రూపంలో చిరకాలం నిలిచి ఉంటుందని అన్నారు ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తాను ఇప్పటివరకు లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సంఘమిత్ర కార్యదర్శి దోసపాటి మల్లన్న బంధువులు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారమే ఆరోగ్యానికి ఆధారం

- 4వ వార్డు గాంధీపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమం
- బాలింతకు శ్రీమంతం చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్



**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 07(తరంగాలు ):** మహబూబాబాద్ జిల్లా పౌష్టికాహారమే ఆరోగ్యానికి ఆధారమని మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోత్ జ్యోతి రమేష్ నాయక్ అన్నారు మహబూబాబాద్ పట్టణంలోని 4వ వార్డు గాంధీపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు ఈ సందర్భంగా గర్భిణీలు బాలింతలు చిన్నారులకు పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు అనంతరం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీకి తన ఆధ్వర్యంలో సీమంత కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా దృఢంగా ఉండవచ్చని ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్కేజీ యూకేజీ కే 30 వేల నుంచి 40 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీల్లో చేర్పించి నాణ్యమైన విద్య మధ్యాహ్న భోజనాన్ని పొందాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ అఖిల సూపర్ వైజర్ భవాని అంగన్వాడీ టీచర్లు నజ్మ స్వప్న సుజాత శివకుమారి ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# " ఓరుగల్లులో ఓటు చోరీపై సమరం"





- "ప్రజాస్వామ్య పరిరక్షణకు అఖిలపక్ష పోరుబాట!"
- ఓటు హక్కుపై దాడిని సహించం..కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర
- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు అఖిలపక్ష నేతల డిమాండ్

**వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 7 (తరంగాలు):** ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత కోసం వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ అఖిలపక్ష పాదయాత్ర నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల సహకారంతో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు.వరంగల్ పోచమ్మైదాన్ సెంటర్ నుంచి కాశీబుగ్గ అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన పాదయాత్రకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాదయాత్ర పొడవునా "ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.. ఓటు హక్కును పరిరక్షించాలి", "ఓటు చోరీని అరికట్టాలి", "సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి" అంటూ నినాదాలు చేశారు.

ఈ పాదయాత్రలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

### ఓటు ప్రజాస్వామ్యానికి పునాది: మహమ్మద్ అయూబ్

పాదయాత్ర అనంతరం కాశీబుగ్గ అంబేద్కర్ సెంటర్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి ఓటు ప్రజల హక్కుకు ప్రతీక అని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కును కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.




### రాహుల్ గాంధీ అరెస్టుపైనా నిరసన

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు అంశాన్ని కూడా నాయకులు ప్రస్తావించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

### పారదర్శక ఎన్నికలే ప్రజాస్వామ్యానికి బలం

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని పేర్కొన్నారు.
ఓటు చోరీ, ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై తలెత్తుతున్న అనుమానాలు, ఆరోపణలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.
రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు, ప్రజాస్వామ్యవాదులు కలిసి తమ ఉద్యమాన్ని కొనసాగిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, బస్మియా, ఎస్ యు సి ఐ (సీ ) నాయకులు అడ్డుల సత్యనారాయణ, అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు నవీద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, ఎస్టీ సెల్ చైర్మన్ రవీందర్ నాయక్, బీసీ సెల్ చైర్మన్ ఓర్సు తిరుపతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కరుణాటి పార్వతమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు అబ్బిడి రాజిరెడ్డి, పిన్నింటి అనిల్ రావు, అత్తి కుమారస్వామి, మండల అధ్యక్షులు పోశాల వెంకన్న గౌడ్, సావిత్రి,మండల, టౌన్, డివిజన్ స్థాయి నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, యువజన, మహిళా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.






# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్.చూంగ్తు



**వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 7,( తరంగాలు ):**సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్.చూంగ్తు సూచించారు.వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్. చూంగ్తు, తెలంగాణ ప్రభుత్వ ప్రణాళిక శాఖ కార్యదర్శి, టీజీఆర్ఏసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జనరల్ డా. గౌరవ్ ఉప్పల్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించిన వారు ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులపై సమీక్షించారు. ఆసుపత్రిలో వైద్య విభాగాలు, రోగులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వైద్యులు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు, అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలను అధికారులతో చర్చించారు.
సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు సూచించారు.నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడరాదని, నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.నిర్మాణ పనుల ప్రతి దశను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.వరంగల్, హనుమకొండ జిల్లాలతో పాటు ఉమ్మడి వరంగల్ ప్రాంత ప్రజలకు అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించేలా ఆసుపత్రిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు.
భవన నిర్మాణం, వివిధ విభాగాల ఏర్పాటు, మౌలిక వసతులు, వైద్య సేవలకు అవసరమైన సౌకర్యాలు, భవిష్యత్‌లో ఏర్పాటు చేయనున్న వైద్య పరికరాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు.
ఈ పరిశీలనలో డీఎంఈ డా. వాణి, డా విమల థామస్, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రాంకుమార్, ఆర్ఎంఓ డా. అశ్విన్‌తో పాటు ఆరోగ్య, వైద్య, ఇంజినీరింగ్ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ అరెస్ట్‌పై కాంగ్రెస్ భారీ నిరసన

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం ఆగదు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 07 (తరంగాలు):** కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎం.డి. ఆయూబ్ ఆధ్వర్యంలో పోశమ్మ మైదాన్ చౌరస్తా నుంచి కాశీబుగ్గ వరకు కాంగ్రెస్ శ్రేణులు నిరసన ర్యాలీ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిదర్శనమన్నారు.ఓట్ల అక్రమాలు, ఓటు చోరీకి సంబంధించిన ఆరోపణలపై రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించేలా కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.
సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను ప్రజల ముందుంచాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ పోరాటానికి దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ఉద్యమిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును అణిచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ప్రజల తరఫున పోరాడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, వర్ధన్నపేట టౌన్ ప్రెసిడెంట్ ఈగ దామోదర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మరుపట్ల సాయికుమార్, సమ్మెట సుధీర్, లింగం రజిత రెడ్డి,డీసీసీ, బ్లాక్, మండల, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రుమాటిక్ హార్ట్ డిసీజ్ అంటే ఏమిటి గొంతు ఇన్‌ఫెక్షన్‌కు దీనికి ఏమిటి సంబంధం

భారత్‌లో గుండె కవాటాల వ్యాధుల పరిస్థితి పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భిన్నంగా ఉంది. వృద్ధాప్యంలో గుండె కవాటాలు అరిగిపోవడం అక్కడ ప్రధాన కారణంగా కనిపిస్తే, భారత్‌లో చిన్నతనంలో వచ్చిన గొంతు ఇన్‌ఫెక్షన్‌కు సరైన చికిత్స అందకపోవడం వల్ల వచ్చే రుమాటిక్ హార్ట్ డిసీజ్ (ఆర్‌హెచ్‌డీ) ముఖ్య కారణంగా ఉంది. ఈ వ్యాధి కారణంగా గుండె కవాటాలు దెబ్బతిని, కొన్నేళ్ల తర్వాత గుండె పనితీరుపై ప్రభావం చూపుతాయి. భారత్‌లో ప్రతి వెయ్యి మందిలో 1.5 నుంచి 2 మందికి ఈ వ్యాధి ఉన్నట్లు అంచనా. మొత్తం మీద 20 నుంచి 25 లక్షల మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. ఒక్క ఏడాదిలోనే సుమారు 88,674 మంది ఈ వ్యాధి కారణంగా ప్రాణాలు కోల్పోతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

### నాలుగు కవాటాలు కీలకం..

గుండెలో రక్తం సరైన దిశలో ప్రవహించేందుకు నాలుగు కవాటాలు కీలకంగా పనిచేస్తాయి. వీటిలో ఏదైనా కవాటం పూర్తిగా తెరుచుకోకపోతే దాన్ని స్టెనోసిస్ అంటారు. సరిగ్గా మూసుకోకపోతే రక్తం వెనక్కి ప్రవహించే పరిస్థితిని రెగర్జిటేషన్ అంటారు. ఈ రెండు పరిస్థితుల్లోనూ గుండెపై అదనపు భారం పడుతుంది. రుమాటిక్ హార్ట్ డిసీజ్‌లో మైట్రల్ కవాటం ఎక్కువగా ప్రభావితమవుతుంది. సుమారు 65 నుంచి 70 శాతం కేసుల్లో ఈ కవాటానికే సమస్య వస్తుంది. ఆ తర్వాత 20 నుంచి 25 శాతం కేసుల్లో ఏఆర్టిక్ కవాటం, సుమారు 10 శాతం కేసుల్లో ట్రైకస్పిడ్ కవాటం ప్రభావితమవుతాయి. చిన్నతనంలో వచ్చిన గొంతు ఇన్‌ఫెక్షన్ సాధారణ సమస్యగానే భావించి నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ నష్టం క్రమంగా సంవత్సరాల పాటు కొనసాగుతుంది.



### లక్షణాలు ఎలా ఉంటాయి..

ఈ వ్యాధి లక్షణాలు మొదట్లో సాధారణ సమస్యల మాదిరిగానే కనిపించడంతో చాలామంది వాటిని పట్టించుకోరు. మెట్లు ఎక్కడం, రోజువారీ పనులు చేయడం వంటి సాధారణ కార్యకలాపాల్లోనే కొత్తగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం, విశ్రాంతి తీసుకున్నా తగ్గని అలసట, ఛాతిలో నొప్పి లేదా అసౌకర్యం, గుండె వేగంగా లేదా క్రమం తప్పినట్లు కొట్టుకోవడం, కాళ్లు, పాదాలు లేదా పొట్ట భాగంలో వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వైద్యులు స్టెతస్కోప్‌తో పరీక్షించినప్పుడు వినిపించే అసాధారణ గుండె శబ్దం కూడా వ్యాధికి ముందస్తు సంకేతంగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాధి భారం పట్టణ ప్రాంతాల కంటే ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మందిలో 2.2 మందికి, పట్టణ ప్రాంతాల్లో 1.23 మందికి ఈ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు.

### మహిళల్లో అధికం..

యువతలో, ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్యపై మరింత అప్రమత్తత అవసరం. రుమాటిక్ హార్ట్ డిసీజ్ ఉన్న మహిళలకు గర్భధారణ సమయంలో గుండెపై అదనపు భారం పడడం వల్ల ఇంతకుముందు గుర్తించని కవాటాల సమస్య బయటపడుతుంది లేదా మరింత తీవ్రమవుతుంది. భారత్‌లో గర్భధారణ సమయంలో గుర్తించే గుండె సంబంధిత వ్యాధుల్లో రుమాటిక్ హార్ట్ డిసీజ్ 40 నుంచి 50 శాతం వరకు ఉంటుందని అంచనా. అందువల్ల అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో గర్భధారణకు ముందు లేదా ప్రారంభ దశలో గుండె పరీక్షలు చేయించుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది

THARANGALU DAILY NEWS
గురువారం, 08 అక్టోబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# క్రీడలు యువతకు స్ఫూర్తిదాయకం





- ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో అవసరం
- బ్యాట్ పట్టి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఈగ మల్లేశం

**వర్ధన్నపేట ప్రతినిధి , అక్టోబర్ 7 (తరంగాలు ):** యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డి.సి. తండా దుర్గమ్మ గుడి ప్రాంగణంలో సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు.తొలి మ్యాచ్‌లో కేశవపురం, ఎన్ఎస్ తండా జట్లకు టాస్ వేసిన ఈగ మల్లేశం.. అనంతరం స్వయంగా బ్యాట్ పట్టి బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. యువత క్రీడలను జీవితంలో ఒక భాగంగా చేసుకుని ఆరోగ్యంగా ముందుకు సాగాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి టోర్నమెంట్లు వారి నైపుణ్యాలను వెలికితీయడానికి దోహదపడతాయని అన్నారు. క్రీడా స్ఫూర్తితో పాటు క్రమశిక్షణను అలవర్చుకుని యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు కల్పిస్తున్న ప్రత్యేక రిజర్వేషన్లు, ఇతర అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థిరపడాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేలా టోర్నమెంట్ నిర్వహించిన సేవాలాల్ యూత్ సభ్యులను ఈగ మల్లేశం అభినందించారు.ఈ కార్యక్రమంలో కరిమిల్ల సంపత్ రావు, జన్ను రాములు, ప్రభాకర్, రాము నాయక్, సంతోష్ నాయక్, రమేష్, నరేశ్‌తో పాటు యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## రాహుల్ గాంధీ అరెస్ట్‌పై కాంగ్రెస్ భారీ నిరసన

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం ఆగదు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 07 (తరంగాలు): కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎం.డి. ఆయూబ్ ఆధ్వర్యంలో పోశమ్మ మైదాన్ చౌరస్తా నుంచి కాశీబుగ్గ వరకు కాంగ్రెస్ శ్రేణులు నిరసన ర్యాలీ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిదర్శనమన్నారు.ఓట్ల అక్రమాలు, ఓటు చోరీకి సంబంధించిన ఆరోపణలపై రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించేలా కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను ప్రజల ముందుంచాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ పోరాటానికి దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ఉద్యమిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును అణిచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ప్రజల తరఫున పోరాడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, వర్ధన్నపేట టౌన్ ప్రెసిడెంట్ ఈగ దామోదర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మరుపట్ల సాయికుమార్, సమ్మెట సుధీర్, లింగం రజిత రెడ్డి,డీసీసీ, బ్లాక్, మండల, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రోజూ 6 గంటల కన్నా తక్కువగా నిద్రిస్తున్నారా అయితే జాగ్రత్త. నిపుణుల హెచ్చరిక



రోజూ తగినంత నిద్రపోవడం శరీరానికి విశ్రాంతిని ఇవ్వడమే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే పని, సామాజిక బాధ్యతలు, ఎక్కువ సమయం తెరల ముందు గడపడం వంటి కారణాలతో చాలామంది నిద్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ముఖ్యంగా రోజూ ఆరు గంటల కంటే తక్కువ సమయం నిద్రపోవడం అలవాటుగా మారితే, ఉదయం అలసటగా ఉండడమే కాకుండా కాలక్రమేణా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. తగినంత నిద్రలో ఉన్నప్పుడు గుండె వేగం, రక్తపోటు తగ్గుతాయి. దీంతో గుండె, రక్తనాళాలకు విశ్రాంతి లభిస్తుంది. నిద్ర తగ్గినప్పుడు ఈ విశ్రాంతి సమయం తగ్గి రక్తపోటు పెరగడంతో పాటు శరీరాన్ని అప్రమత్తంగా ఉంచే సానుభూతి నాడీ వ్యవస్థ అధికంగా పనిచేస్తుంది.

### అనేక సమస్యలు..

నిద్రలేమి ప్రభావం కేవలం అధిక రక్తపోటుకే పరిమితం కాదు. ఆకలి, రక్తంలో చక్కెర స్థాయిలు, జీవక్రియను నియంత్రించే హార్మోన్ల సమతుల్యతకూ నిద్ర ముఖ్యమే. తగినంత నిద్రపోని వారిలో అధిక కేలరీలు ఉండే ఆహారాలపై కోరిక పెరుగుతుంది. వ్యాయామం చేయాలనే ఉత్సాహం కూడా తగ్గుతుంది. ఈ పరిస్థితులు దీర్ఘకాలంలో శరీర బరువు పెరగడం, ఊబకాయం, రక్తంలో చక్కెర నియంత్రణ సరిగా లేకపోవడం వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇవన్నీ గుండె సంబంధిత వ్యాధులకు ప్రధాన ప్రమాద కారకాలుగా మారుతాయి. అయితే ఒక్కరోజు నిద్ర సరిగా లేకపోవడం, ప్రతిరోజూ ఐదు లేదా ఆరు గంటలకే పరిమితమవడం ఒకే రకమైన ప్రభావాన్ని చూపవు. నిద్రలేమి రోజువారీ జీవితంలో అలవాటుగా మారినప్పుడే దీర్ఘకాలిక ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

### నిద్ర నాణ్యత ముఖ్యం..

నిద్ర ఎంతసేపు పడుతున్నామన్నదే కాకుండా, నిద్ర నాణ్యత కూడా అంతే ముఖ్యం. ఏడు లేదా ఎనిమిది గంటలు నిద్రపోయినా శ్వాస సంబంధిత సమస్యలు, తరచూ నిద్ర మేల్కొనడం, ఒత్తిడి, కొన్ని మందుల దుష్ప్రభావాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా నిద్ర నాణ్యత తగ్గుతుంది. అందువల్ల తగినంత సమయం నిద్రపోయినా విశ్రాంతి లభించకపోతే దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. నిద్రపోయేందుకు తరచూ ఇబ్బంది పడడం, రాత్రివేళ పదేపదే మేల్కొనడం లేదా పగటిపూట అధిక నిద్రమత్తు ఉండడం వంటి సమస్యలు కొనసాగితే వైద్యులను సంప్రదించడం అవసరం. సమస్యకు కారణమయ్యే ఇతర ఆరోగ్య పరిస్థితులను గుర్తించడం కూడా ముఖ్యమే.

### జీవగడియారం సరిగ్గా ఉండాలి..

నిద్రను మెరుగుపరచుకోవడానికి ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, ఒకే సమయానికి మేల్కొనడం ద్వారా శరీర జీవ గడియారాన్ని క్రమబద్ధీకరించుకోవచ్చు. సాయంత్రం తర్వాత కెఫీన్‌కు దూరంగా ఉండడం, నిద్రకు ముందు ఎక్కువగా తినకపోవడం, మద్యం వినియోగాన్ని తగ్గించడం, పడకగదిలో అనవసరమైన ఆటంకాలను తొలగించడం ఉపయోగకరంగా ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నాణ్యమైన నిద్రతోపాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, బరువును నియంత్రించుకోవడం, రక్తపోటు, రక్తంలో చక్కెరను అదుపులో ఉంచడం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం కూడా అవసరం. నిద్రలోనూ గుండె నిరంతరం పనిచేస్తూనే ఉన్నప్పటికీ, ఆ సమయంలో లభించే విశ్రాంతి గుండెకు ఎంతో అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం దేశ ప్రగతికి దిక్సూచి - రావు పద్మ రెడ్డి





- హనుమకొండలో 'సేవా జ్యోతి యాత్ర--వికసిత భారత్ సంకల్ప సభ'
- ముఖ్యఅతులుగా హాజరైన బీజేపీ జాతీయ నాయకులు పి. మురళీధర్ రావు,హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్.

**హనుమకొండ ప్రతినిధి , అక్టోబర్ 7 (తరంగాలు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన హనుమకొండలో 'సేవా జ్యోతి యాత్ర--వికసిత భారత్ సంకల్ప సభ' నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ నాయకులు పి. మురళీధర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ నాయకురాలు రావు పద్మ రెడ్డి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.అంబేద్కర్ విగ్రహం వద్ద శాస్త్రోక్తంగా 'సేవా జ్యోతి'ని ప్రతిష్ఠించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భారీ ఎల్ఈడి స్క్రీన్లపై ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ సందేశాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సామూహికంగా వీక్షించారు. 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్య సాధనలో భాగస్వాములమవుతామని వేలాది మంది కార్యకర్తలు, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.సభ అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి అమరవీరుల స్థూపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పెద్దపీట: రావు పద్మ రెడ్డి**

ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ.. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు నరేంద్ర మోదీ ప్రజాసేవకు అంకితమయ్యారని పేర్కొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని ఆమె అన్నారు. రహదారులు, రైల్వేలు, వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, పర్యాటకం, విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తోందని తెలిపారు.

తెలంగాణలో రూ.47,984 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, కొత్త రైల్వే లైన్లు, అమృత్ భారత్, వందే భారత్ రైళ్లతో పాటు జాతీయ రహదారుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నట్లు ఆమె వివరించారు.కాజీపేట రైల్వే కోచ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, హైదరాబాద్‌ను బయోఫార్మా, సెమీకండక్టర్, టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేసే కార్యక్రమాలకు కేంద్రం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. పీఎం స్వానిధి, ఎం ఎస్ ఎం ఈ గ్రోత్ ఫండ్ ద్వారా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక సహకారం అందిస్తోందని పేర్కొన్నారు.యువతకు స్టెమ్ , నైపుణ్యాభివృద్ధి రంగాల్లో అవకాశాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు."సేవే సంకల్పంగా... అభివృద్ధే లక్ష్యంగా... వికసిత భారత్ కోసం మనమందరం కలిసి ముందుకు సాగుదాం" అని రావు పద్మ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా పదాధికారులు, డివిజన్, మండల అధ్యక్షులు, కౌన్సిల్ సభ్యులు, యువమోర్చా నాయకులు, విద్యార్థులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
గురువారం, 08 అక్టోబర్ , 2026


# వృద్ధుల హక్కులకు భరోసా గౌరవానికి పెద్దపీట

- అర్హులైన ప్రతి వృద్ధుడికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి
- వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, వివక్ష, వేధింపులకు తావులేకుండా చూడాలి
- సమన్వయంతో వృద్ధుల సమస్యలకు పరిష్కారం చూపాలి: అదనపు కలెక్టర్ విద్యాచందన




**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ అక్టోబరు 7:** వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి ఎం. విద్యాచందన అన్నారు. వృద్ధులకు గౌరవం, భద్రత, ఆరోగ్య సంరక్షణతో పాటు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడం కుటుంబం, సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో వృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ విద్యాచందన వృద్ధులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులు కుటుంబానికి, సమాజానికి అమూల్యమైన సంపద అని అన్నారు. జీవిత అనుభవం, జ్ఞానం, విలువలను తరతరాలకు అందిస్తూ సమాజ నిర్మాణంలో వృద్ధులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. వృద్ధుల పట్ల గౌరవం, ఆప్యాయత, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు.

వృద్ధుల హక్కుల పరిరక్షణతో పాటు వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత, ఆర్థిక భరోసా వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి వృద్ధుడికి చేరేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



## నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలి

వృద్ధులపై నిర్లక్ష్యం, వివక్ష, వేధింపులు చోటుచేసుకోకుండా కుటుంబ సభ్యులు, సమాజం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అవసరమైన సందర్భాల్లో వృద్ధులకు చట్టపరమైన సహాయం, వైద్య సేవలు, సామాజిక భద్రత, ఇతర ప్రభుత్వ సేవలు అందేలా అధికారులు చొరవ చూపాలని అన్నారు. వృద్ధుల సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు స్వయం సహాయక సంఘాలు, వృద్ధుల సంఘాలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన

వృద్ధులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతా కార్యక్రమాలు, వివిధ సేవలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. వృద్ధుల సమస్యలను నేరుగా తెలుసుకొని, వారికి అవసరమైన సహకారం అందించేందుకు అధికారులు, సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధుల స్వయం సహాయక సంఘాల సభ్యులను ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా విద్యాశాఖ అధికారి శంభు ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి అనూష, ప్రధాన బ్యాంకు నిర్వాహకుడు రామ్‌రెడ్డి, న్యాయవాది యు. అరుణ్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దినేష్, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నీలేష్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రతినిధి రంగారావు, మండల పరిషత్ అధ్యక్షురాలు సుజాత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జ్యోతి, సఖి కేంద్ర ప్రతినిధులు, జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు, సహాయ ప్రాజెక్టు నిర్వాహకులు, సమన్వయకర్తలు, వృద్ధుల స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో అయ్యప్ప పూజా విధానం శిక్షణ తరగతులు

- కేరళ సాంప్రదాయ పద్ధతిలో గురుస్వాములు,అయ్యప్ప భక్తులకు శిక్షణ
- బ్రహ్మశ్రీ డాక్టర్ ప్రదీప్ కుమార్ తంత్రి ఆధ్వర్యంలో శిక్షణ



**వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 7 (తరంగాలు):** కేరళ తాంత్రిక ఆచార్యులు బ్రహ్మశ్రీ డాక్టర్ కుసుమ ప్రదీప్ కుమార్ తంత్రి ఆధ్వర్యంలో వరంగల్‌లోని స్టేషన్ రోడ్‌లో మహాశాస్త్ర తంత్ర పీఠం రెండో శాఖను ఘనంగా ప్రారంభించారు. తెలంగాణలో తొలిసారిగా హైదరాబాద్‌లో, రెండో కేంద్రంగా వరంగల్‌లో ఈ పీఠాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్ప స్వామి సమాజానికి కేరళ సాంప్రదాయ పద్ధతిలో అయ్యప్ప స్వామి పూజా విధానంపై శిక్షణ అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు డాక్టర్ ప్రదీప్ కుమార్ తంత్రి తెలిపారు. కుల, మత, లింగ భేదాలకు అతీతంగా అయ్యప్ప భక్తులు, గురుస్వాములకు పూజా విధానంపై జ్ఞానాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. వరంగల్ స్టేషన్ రోడ్‌లో గత నాలుగు సంవత్సరాలుగా తంత్ర పీఠం కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, ప్రతి బుధవారం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి నుంచి శిక్షణను మూడు విధాలుగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ తరగతులతో పాటు ప్రతి ఆదివారం గురుకుల పద్ధతిలో ప్రత్యక్ష శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. మహాశాస్త్ర తంత్ర పీఠం సెంట్రల్ కార్యాలయం హైదరాబాద్--ఘట్‌కేసర్‌లో ఉండగా, రెండో శాఖను వరంగల్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం మొదటి విడత అడ్మిషన్లు జనవరిలో, రెండో విడత అడ్మిషన్లు జూన్‌లో నిర్వహిస్తామని చెప్పారు. వరంగల్ ట్రైసిటీతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని అయ్యప్ప భక్తులు, గురుస్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురుస్వామి డాక్టర్ ప్రదీప్ కుమార్ కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో గురుస్వాములు పోలా ఉమామహేశ్వర్, రాచర్ల రాజు, వెల్దండి ఓంకార్, వేముల రంజిత్, హనుమంతరావు, ఉంగరాల వెంకన్న, కోరే వెంకటస్వామి, వేయికండ్ల జితేందర్, చెవ్వ సంపత్ కుమార్, సుంకేనపల్లి శ్రీనివాస్, గంధసిరి రమేష్, ఆదేపు రఘు తదితరులు, అయ్యప్ప స్వామి భక్త బృందం పాల్గొన్నారు.

# బాధితురాలికి బాల్య మిత్రుల ఆర్థిక భరోసా

- స్నేహితురాలికి బాల్య మిత్రుల చేయూత
- సునీతకు బాల్యమిత్రుల ఆర్థిక సహాయం అందజేత



**వర్ధన్నపేట ప్రతినిధి,అక్టోబర్ 7, తరంగాలు** : మండలంలోని నల్లబెల్లి గ్రామంలో బిర్రు నర్సయ్య ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. సమాచారం అందుకున్న నర్సయ్య మూడో కూతురు సునీత చిన్ననాటి బాల్య మిత్రులు 1988–89 పదవ తరగతి విద్యార్థుల సేవ నిధి మిత్రబృందం బుధవారం బాధిత కుటుంబాన్ని సందర్శించి చిన్ననాటి క్లాస్మేట్ బాల్య స్నేహితురాలు సునీతను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. నర్సయ్య మృతి గల కారణాలను అడిగి తెలుసుకుని చిన్ననాటి స్నేహితురాలు నిస్సహాయ స్థితిలో ఉన్న ఆర్థిక పరిస్థితులకు చెల్లించి పోయిన సేవా నిధి మిత్రబృందం సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని సునీతకు అందజేసి బాల్య మిత్రురాలికి ఆర్థిక భరోసాలిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ నల్లబెల్లి 1988–89 పూర్వ విద్యార్థుల సేవా నిధి మిత్రబృందం ప్రతినిధులు గోలి కొమురయ్య గజ్జల శ్రీనివాస్, ఆరెల్లి శ్రీనివాస్ ముత్యం సంపత్ బిర్రు గోపాల్ వర్కాల సుధాకర్ మాలో సుందర్ తంగేళ్ల యాదగిరి చిరునోముల కృష్ణ బిర్రు పూలమ్మ ఎండి అబ్దుల్ నబీ వివో ఏ బిర్రు దయాకర్ మాజీ వార్డ్ మెంబర్ బిర్రు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగుల పిల్లలతో బతుకమ్మ సంబరాలు



- పిల్లల ఆనందం, ఆటపాటలు మనసుకు ఎంతో ఆనందాన్నిచ్చాయి: డాక్టర్ అనితా రెడ్డి

**హనుమకొండ ప్రతినిధి , అక్టోబర్ 7 (తరంగాలు):** మానసిక దివ్యాంగుల పిల్లలతో కలిసి నిర్వహించిన బతుకమ్మ సంబరాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. బుధవారండాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఆశ్రమంలోని పిల్లలు, సిబ్బంది కలిసి బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనితా రెడ్డి బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. ఇతర పండుగల్లో వివిధ దేవుళ్లను పూలతో పూజిస్తే, బతుకమ్మ పండుగలో పూలనే అమ్మవారిగా కొలవడం ప్రత్యేకత అని పేర్కొన్నారు. మహిళలు తమ పసుపు, కుంకుమలను కాపాడాలని గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజిస్తారని తెలిపారు.

ప్రపంచంలో మరెక్కడా లేని ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే పండుగగా బతుకమ్మ నిలుస్తుందని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. పండుగ సెలవులు రానున్న నేపథ్యంలో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను నిర్వహించామని తెలిపారు. మానసిక దివ్యాంగులైన పిల్లలకు ఆనందాన్ని పంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లల ఆనందం, కోలాటాలు, నృత్యాలు, బతుకమ్మ పాటలు అందరినీ అలరించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీయూ ప్రవీణ్, సుచరిత, వసుధ, హరిత, భార్గవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




# దేవాదుల సహా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష



**వరంగల్ ప్రతినిధి , అక్టోబర్ 07, (తరంగాలు):** తెలంగాణలోని ప్రగతి/పీఎంజీ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలపై బుధవారం ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటేరియట్ కార్యదర్శి (కోఆర్డినేషన్) మనోజ్ గోవిల్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో తెలంగాణలో అమలవుతున్న వివిధ నీటిపారుదల, రైల్వే ప్రాజెక్టులతో పాటు దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో పాటు డీఆర్వో విజయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రషర్ల ధాటికి పిండవుతున్న 'బోడగట్టు'

- బోరుమంటున్న పరమశివుడు!?
- పాలకులు -- అధికారుల 'మైనింగ్' గుట్టు.. శివయ్యకే ఎరుక
- మూడు గ్రామాల నడుమ అక్రమ క్రెషర్లు.. నిద్రలేని రాత్రుల్లో సరిహద్దు ప్రజలు
- విధ్వంసమవుతున్న చారిత్రక కొలను.. మట్టిపాలవుతున్న పవిత్ర తీర్థం?
- రాత్రిపూట లారీల మోత, ధూళి మేఘాలతో గుండె రోగుల విలవిల?
- హాసన్‌పర్తి మండలంలో మూడు గ్రామాల ప్రజల ఆర్తనాదాలు
- పాలకులు,అధికారుల నిర్లక్ష్యంపై నిరసన జ్వాలలు?




**హాసన్‌పర్తి ప్రతినిధి ,అక్టోబర్ 7, తరంగాలు :** హనుమకొండ జిల్లా హాసన్‌పర్తి మండలం పరిధిలోని చింతగట్టు, జయగిరి, మునిపల్లి గ్రామాల సరిహద్దుల్లో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన 'బోడగట్టు' ప్రస్తుతం అక్రమ క్రెషర్లు, నిరంతర బ్లాస్టింగ్ల ధాటికి ధ్వంసమవుతోంది. గుట్టను క్రెషర్ల నిర్ నిర్దాక్షిణ్యంగా పిండి పిండి చేస్తుండటంతో ప్రకృతి సౌందర్యంతో పాటు ఇక్కడి ఆధ్యాత్మిక వాతావరణం పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోంది.?

చట్టాలు ప్రజల ప్రాణాలను, పర్యావరణాన్ని కాపాడటానికి ఉన్నాయా? లేక వ్యాపారుల జేబులు నింపడానికి వంగిపోతున్నాయా? అనే దానికి అద్దం పడుతోంది హనుమకొండ జిల్లా హాసన్‌పర్తి మండలంలోని 'బోడగట్టు' విధ్వంసం. చింతగట్టు, జయగిరి, మునిపల్లి గ్రామాల సరిహద్దుల్లో ఉంటూ, శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ గుట్టపై క్రెషర్ల దందా సాగుతుంటే పాలకులు, అధికారులు మౌనం వహించడం వెనుక పక్కా సూత్రధారులు ఉన్నారని స్థానికులు మండిపడుతున్నారు.

### అనుమతుల వెనుక "అనుమానాల" పుట్ట:

మూడు గ్రామాల నడుమ, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించేలా ఉన్న ఈ గుట్టకు మైనింగ్ పర్మిషన్లు ఎలా వస్తున్నాయో ఎవరికీ అర్థం కావడం లేదు. పర్యావరణ అనుమతులు, గనుల శాఖ నిబంధనలు అన్నీ బొందపెట్టి, అధికారుల అండదండలతోనే ఈ విధ్వంసం సాగుతోందన్నది ప్రత్యక్ష సత్యం. చారిత్రక కోనేరును ధ్వంసం చేసి, భక్తుల నమ్మకాలను అణచివేస్తున్నా ఏ ఒక్క అధికారి కూడా ఇటువైపు వచ్చి సమీక్షించిన దాఖలాలు లేవు.

ధ్వంసమైన పవిత్ర కొలను:

బోడగట్టుపై పూర్వం నుండి ఒక పవిత్రమైన కోనేరు (కొలను) ఉండేది. ఈ కొలనులోని నీటితోనే స్వామివారికి అభిషేకం చేసేవారు. మట్టి తవ్వేకొద్దీ స్వచ్ఛమైన ఊట నీరు రావడం ఇక్కడి ప్రత్యేకత. ఈ పవిత్ర జలాన్ని సేవిస్తే రోగాలు, ఆర్థిక బాధలు, సమస్త సమస్యలు తొలగిపోతాయని చుట్టుపక్కల గ్రామాల ప్రజల గట్టి నమ్మకం. అయితే, ఇటీవల జరిగిన విచక్షణారహిత బ్లాస్టింగ్ లతో ఈ చారిత్రక కోనేరు పూర్తిగా ధ్వంసమైంది. కొలను ఉనికి కోల్పోవడంతో "శివయ్యే కన్నీరు పెడుతున్నాడంటూ" స్థానిక భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.?

### అర్ధరాత్రి లారీల మోత.. రోగుల విలవిల:

క్రెషర్ల నిర్ నిర్వాకం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజల జీవితాలు నరకప్రాయంగా మారాయి. రాత్రి వేళల్లో లారీలు వేగంగా వెళ్తుండటంతో వచ్చే భారీ శబ్దాలకు జనాలు భయాందోళనకు గురై బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ధూళి, కాలుష్యం పెరిగిపోవడంతో ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు ఇక్కడ బ్రతకడమే కష్టంగా మారిందని రోగ నిట్టూరుస్తున్నారు. కంటినిండా నిద్రలేక, స్వచ్ఛమైన గాలి పీల్చలేక స్థానికులు అలమటిస్తున్నారు.

### ?పట్టించుకోని పాలకులు, అధికారులు:

ఏ ప్రభుత్వం వచ్చినా, ఎవరు అధికారంలో ఉన్నా ఈ గుట్ట విధ్వంసాన్ని చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారా? లేక తమ స్వంత ప్రయోజనాలు, ఖజానాలు నింపుకోవడానికే పరిమితమయ్యారా? అని స్థానికులు తీవ్రస్థాయిలో ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బోడగట్టుపై జరుగుతున్న అక్రమ తవ్వకాలను, బ్లాస్టింగ్ లను తక్షణమే నిలిపివేయాలని, పర్యావరణాన్ని, చారిత్రక సాంప్రదాయాలను కాపాడాలని గ్రామీణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటాం:

మనుషుల ప్రాణాల కంటే, పవిత్రమైన శివుని కొలను కంటే వ్యాపారుల కమీషన్లే పాలకులకు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తమవుతోంది. అధికారుల గుట్టు, పాలకుల స్వార్థం శివుడికి తెలుసో లేదో గానీ, నిత్యం భయంతో కాలం వెళ్లదీస్తున్న గ్రామీణులకు మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. తక్షణమే ఈ మైనింగ్ అనుమతులను రద్దు చేసి, క్రెషర్లను మూసివేయకపోతే మూడు గ్రామాల ప్రజలు ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరిస్తున్నారు.




# అగార్కర్ వల్లే భువీ కంబ్యాక్ ఆగిపోయిందా?




టీమిండియా స్వింగ్ సుల్తాన్ భువనేశ్వర్ కుమార్ దాదాపు నాలుగేళ్ల తర్వాత మళ్లీ భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టులో భువికి చోటు దక్కడం అభిమానులకు ఊరటనిచ్చింది. అయితే ఇన్నాళ్లూ ఆయనను జట్టులోకి తీసుకోకపోవడానికి మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కరే ప్రధాన కారణమంటూ ఒక దిగ్భ్రాంతి కర కథనం వెలుగులోకి వచ్చింది. అగార్కర్ పదవీ కాలం ముగియడం, ప్రజ్ఞాన్ ఓజా నేతృత్వంలోని తాత్కాలిక సెలెక్షన్ కమిటీ రావడం వెనువెంటనే జరగడంతో భువి కమ్‌బ్యాక్ సాధ్యమైంది.గత కొంతకాలంగా ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ భువనేశ్వర్ కుమార్‌ను అగార్కర్ సెలెక్షన్ కమిటీ వరుసగా పక్కన పెడుతూ వచ్చింది. భవిష్యత్తు అవసరాల కోసం కేవలం యంగ్ ఫాస్ట్ బౌలర్లను మాత్రమే ప్రోత్సహించాలని అగార్కర్ గట్టిగా భావించడమే దీనికి కారణమని తెలుస్తోంది. కమిటీలోని మాజీ పేసర్ ఆర్‌పీ సింగ్ పలుమార్లు భువీ పేరును ప్రతిపాదించినా, అగార్కర్ మద్దతు లభించకపోవడంతో ఆయన రీఎంట్రీ ఆలస్యమైందని ఆ నివేదిక పేర్కొంది. అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా తప్పుకున్న తర్వాత బీసీసీఐ ప్రజ్ఞాన్ ఓజాను తాత్కాలిక సెలెక్షన్ కమిటీ హెడ్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఓజా, భువనేశ్వర్ అనుభవంపై పూర్తి నమ్మకం ఉంచి న్యూజిలాండ్ పర్యటనకు ఎంపిక చేశారు. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేని లోటును భర్తీ చేసేందుకు, అనుభవజ్ఞుడైన భువీ ఉండటం జట్టుకు ఎంతో ప్రయోజనకరమని సెలెక్టర్లు భావించారు. 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్‌లో ఆర్‌సిబి వరుసగా రెండు టైటిళ్లు గెలవడంలో కీలక పాత్ర పోషించారు. భువి రీఎంట్రీ కేవలం పాత పేరు చూసి ఇచ్చినది కాదు. ఐపీఎల్ 2025లో ఆర్‌సిబి తరఫున 14 మ్యాచుల్లో 17 వికెట్లు, 2026 సీజన్‌లో 16 మ్యాచుల్లో ఏకంగా 28 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో సత్తా చాటారు. భారత్ తరఫున ఇప్పటివరకు 87 ౨20 మ్యాచ్‌ల్లో 90 వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్, కొత్త బంతితో స్వింగ్ చేసే నైపుణ్యంతో మళ్లీ టీమిండియాలో మెరవడానికి సిద్ధమయ్యారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో యంగ్ టీమ్‌తో కలిసి ఆయన న్యూజిలాండ్ సిరీస్‌లో ఆడనున్నారు. న్యూజిలాండ్ సిరీస్ కోసం శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. జట్టులో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ, అక్షర్ పటేల్, శివం దూబే, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ స్థానం సంపాదించారు. ఈ యంగ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ కాంబినేషన్ సిరీస్‌లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## భారత క్రికెట్‌కు 'రో-కో' ఒక వరం

**పాకిస్థాన్ మాజీ పేసర్ సోహైల్ తన్వీర్**




టీమిండియా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో కొనసా గడం భారత క్రికెట్‌కు దొరికిన ఒక వరం అని పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ సోహైల్ తన్వీర్ ప్రశంసిం చాడు. వారిద్దరి అపార అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని, రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని వారి సేవలు అత్యంత కీలకమని అభిప్రాయపడ్డాడు. ఇటీవల ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ సోహైల్ తన్వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "విరాట్ కోహ్లీ గణాంకాలే అతని సత్తా ఏంటో చెబుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు అతను ఎన్నో మధురమైన జ్ఞాపకాలను అందించాడు. కోహ్లీ వీలైనంత ఎక్కువ కాలం ఆడటం భారత క్రికెట్‌కు నిజంగా ఒక వరం" అని ఆయన అన్నాడు. ఇదే విషయాన్ని రోహిత్ శర్మకు కూడా వర్తింపజేస్తూ, వయసును ప్రతికూలంగా చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. 2024 జూన్ లో టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత కోహ్లీ, రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు, 2025 మేలో టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇద్దరూ కేవలం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో తన్వీర్ మాట్లాడుతూ.. "సీనియర్ ఆటగాళ్లకు తమ ఆటను ఎలా నిర్వహించుకోవాలో బాగా తెలుసు. అదే సమయంలో వారు యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయగలరు. రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్, లయను కాపాడుకోగలిగితే, అతను, కోహ్లీ ఇద్దరూ జట్టులో కొనసాగడం శుభపరిణామం" అని వివరించాడు. 39 ఏళ్ల రోహిత్ శర్మ ఇటీవలి కాలంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో 92, 101 పరుగులు సాధించాడు. అతను 2027 ప్రపంచకప్‌లో ఆడతాడా? లేదా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ, ఫామ్, ఫిట్‌నెస్ ఉన్నంతవరకు వయసుతో సంబంధం లేదని తన్వీర్ నొక్కిచెప్పాడు. అనుభవజ్ఞులైన ఈ ఇద్దరు ఆటగాళ్ల మార్గదర్శకత్వం లో యువ జట్టు రాటుదేలుతుందని అభిప్రాయపడ్డాడు.

## భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా స్మృతి మంధాన..




భారత మహిళ క్రికెట్? జట్టు కెప్టెన్‌గా సీనియర్ ఓపెనర్ స్మృతి మంధాన నియమితులయ్యారు. భారత మహిళా క్రికెట్ జట్టు సారథ్యం నుంచి హర్మన్ ప్రీత్ కౌర్ వైదొలిగిన నేపథ్యంలో ఆమె స్థానంలో స్మృతి మంధానను కెప్టెన్‌గా నియమిస్తూ బీసీసీఐ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా స్మృతి మంధానకు బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా శుభాకాంక్షలు తెలిపారు. భారత మహిళ క్రికెట్ జట్టులో అత్యంత అనుభవజ్ఞులైన క్రీడాకారిణుల్లో ఒకరైన మంధాన, 2013 నుంచి జాతీయ జట్టులో సభ్యురాలిగా కొనసాగుతూ ఈ బాధ్యతను చేపట్టారు. ఆమె గతంలో 18టీ20, లు, నాలుగు వన్డేలలో భారత జట్టుకు నాయకత్వం వహించారు. భారత జట్టుకు నాయకత్వం వహించే బాధ్యత తనకు అప్పగించడంపై స్మృతి మంధాన స్పందించారు. ఇది తనకు దక్కిన ప్రత్యేకమైన గౌరవంగా ఆమె పేర్కొన్నారు. తనకు వచ్చిన ఈ అవకాశం ఎంతో విలువైందిగా భావిస్తానని, అలాగే, తనకు మద్దతుగా నిలిచి నమ్మకం ఉంచిన బీసీసీఐ, సెలక్టర్లు, సహచర క్రికెటర్లకు స్మృతి కృతజ్ఞతలు తెలిపారు. భారత మహిళా క్రికెట్? జట్టును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. అదే సమయంలో గత కొన్నేళ్లుగా సారథ్యం వహించిన హర్మన్ ప్రీత్ సేవలను స్మృతి అభినందించారు. గొప్ప నిబద్ధతతో జట్టును ముందుకు నడిపించడంలో హర్మన్? కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

ఈ నెలలో జింబాబ్వేతో స్వదేశంలో జరిగే టీ20, వన్డే సిరీస్‌లకు స్మృతి మంధానను సారథిగా వ్యవహరించనున్నారు. టీ20ల్లో షెఫాలి వర్మ, వన్డేల్లో దీప్తి శర్మ వైస్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. అయితే, రెండు జట్లలోనూ హర్మన్‌ప్రీత్‌కు చోటు దక్కింది. రాయ్‌పుర్ వేదికగా ఈ నెల 16, 18, 20 తేదీల్లో టీ20 సిరీస్ జరుగనుంది. 23, 25, 28 తేదీల్లో వడోదర వన్డే సిరీస్‌కు ఆతిథ్యమివ్వనుంది. టీ20 జట్టులో ప్రతీకా రావల్‌కు చోటు దక్కలేదు. కానీ నికీ ప్రసాద్, మిన్ను మణి, అనుష్క శర్మ జింతిమని కలితాలను జట్టులోకి తీసుకున్నారు. వీరంతా ఆస్ట్రేలియా మహిళల జట్టుతో ఇటీవల జరిగిన సిరీస్‌లలో ఆడారు. ఇక, స్మృతి మంధాన విషయానికొస్తే, 29 ఏళ్ల మంధాన దేశవాళీ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో నాయకురాలిగా గణనీయమైన విజయాన్ని సాధించారు. ముఖ్యంగా 2024, 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్?సీబీ) జట్టును 'ఉమెన్స్ ప్రీమియర్ లీగ్' (డబ్ల్యూపీఎల్?) టైటిల్స్ వైపు నడిపించడం ఇందులో చెప్పుకోదగ్గ విషయం. ఈ విజయాలే ఆమెకు భారత జట్టు పూర్తిస్థాయి నాయకత్వ బాధ్యతలు దక్కేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయని చెప్పవచ్చు. మరోవైపు, స్మృతి మంధాన నియామకంపై మిథున్ మన్హాస్ అభినందనలు తెలిపారు. స్మృతిపై పూర్తి నమ్మకం ఉందని, ఆటపై ఆమెకు ఉన్న అనుభవం ఈ కొత్త బాధ్యతలో జట్టుకు ఎంతో మేలు చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్మృతి సమర్థవంతంగా కెప్టెన్సీ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలరని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. స్మృతి సాధించిన విజయాని ఆయన ప్రస్తావించారు. "భారత జట్టుకు నాయకత్వం వహించడం ఒక కీలకమైన బాధ్యత, కానీ ఆ బాధ్యతను స్వీకరించే అనుభవం, స్వభావం స్మృతికి ఉన్నాయి. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గా ఆమె సాధించిన విజయం ఆమె నాయకత్వ లక్షణాలకు మరో నిదర్శనం" అని సైకియా తెలిపారు.